సాక్షి
మహబూబాబాద్
సోమవారం । 11 । సెప్టెంబర్ । 2023



### అతిపెద్ద గానుగరాయి
రఘునాథపల్లి మండలం కుర్చపల్లిలో అతిపెద్ద గానుగరాయిని చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి వెలుగులోకి తెచ్చారు. - 8లో▸



### పంటలకు సస్య‘రక్షణ’
కూరగాయలు, ఉద్యాన తోటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై ఉద్యాన శాఖ అధికారి రమేశ్ పలు సూచనలు చేశారు. - 8లో▸

### వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.5° /24.7°
ఉదయం నుంచి సాధారణ వాతావరణం ఉంటుంది. పలుప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉండి, చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### రైతుకష్టం తెలిసిన నాయకుడు కేసీఆర్



దంతాలపల్లి: రైతుకష్టం తెలిసి రైతులకోసం అనునిత్యం ఆలోచించే నాయకుడు సీఎం కేసీఆర్ అని మహబూబాబాద్ ఎంపీ, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత అన్నారు. ఆదివారం మండలంలోని బొడ్లాడ గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకోసం నిరంతర ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతుబీమా, రైతు రుణమాఫీ చేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. రాష్ట్ర అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమన్నారు. అనంతరం గ్రామంలో వివిధ కారణాలతో మృతిచెందిన రాపాక వీరయ్య(జీపీ వాటర్ మ్యాన్) జనిగల ఐలమ్మ, పులుగుజ్జ సామక్క కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పి, ఆర్థిక సాయం అందజేశారు. ఆమె వెంట సర్పంచ్ మంద సుష్మగౌడ్, మాజీ సర్పంచ్ నరేందర్ గౌడ్, జనిగల సురేష్, ఎర్రం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### 13న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

మహబూబాబాద్ అర్బన్ : ఈ నెల 13న మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో 14ఏళ్ల పైబడిన బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు (ఆల్ ఈవెంట్స్) నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నాగమణి ఆదివారం ప్రకటన తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారిని ఈనెల 21న హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగలవారు జనన ధ్రువీకరణ, పదో తరగతి మెమో జిరాక్స్ వెంట తీసుకురావాలని, పూర్తి వివరాలకు 90526 70288 సంప్రదించాలని సూచించారు.

### మొదటి తేదీనే వేతనాలు విడుదల చేయాలి

మహబూబాబాద్ అర్బన్ : ప్రతి నెలా మొదటి తేదీనే వేతనాలు విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు బి.హరినాయక్ ప్రభుత్వాన్ని కోరారు. జీతాలు ఆలస్యంగా రావడంతో ఉద్యోగుల, ఉపాధ్యాయుల, కుటుంబ అవసరాలకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు.

### పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో ఈనెల 12 నుంచి నిర్వహించాల్సిన బీపీఈడీ, ఎంపీఈడీ పరీక్షలు, ఈనెల 13 నుంచి జరగాల్సిన ఐదేళ్ల లా, మూడేళ్ల లా పరీక్షలను నిరవధికంగా వాయిదా వేయిసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి ఆదివారం తెలిపారు. మళ్లీ ఆయా పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది తర్వాత రీ షెడ్యూల్ చేస్తామని తర్వాత వెల్లడిస్తామని తెలిపారు.

### పాండవుల గుట్టలో ములుగు ఎస్పీ



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని పర్యాటక ప్రాంతమైన పాండవుల గుట్టలో ములుగు ఎస్పీ గాష్ ఆలం ఆదివారం కుటుంబసభ్యులతో పర్యటించారు. ఈ సందర్భంగా పాండవుల గుట్టలో పర్యటించి రాతి అందాలకు ముగ్ధులై కెమెరాల్లో రాతి అందాలను బందించారు. పూర్వంలోని రాతి పేయింటింగ్‌ల వివరాలను గైడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హిమాచల్ ప్రదేశ్ సిమ్లా ఎస్పీ మానవ్ వర్మ, రేగొండ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

### తునికాకు బోనస్‌పై విచారణ చేపట్టాలి



ఏటూరునాగారం: తునికాకు బోనస్ డబ్బుల విషయంలో సీబీఐతో విచారణ చేపట్టాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని శాపల్లిలో తునికాకు కూలీలతో ఆమె ఆదివారం మాట్లాడారు. బోనస్ డబ్బులు అడ్డదారిలో అటవీశాఖ అధికారులు, కల్లెదారులు తమ ఖాతాల్లో జమ చేసుకుని వారి ఇష్టానికి వాడుకున్నారని మండిపడ్డారు. వెంటనే దీనిపై విచారణ చేపట్టి దోషులను శిక్షించాలన్నారు.

# సమ్మెకు సిద్ధం

- నేటి నుంచి అంగన్‌వాడీల పోరుబాట
- కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్
- సమ్మె చేయకండి: మంత్రి సత్యవతి



జిల్లా సంక్షేమాధికారి హైమావతికి సమ్మె నోటీస్ అందచేస్తున్న నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు(ఫైల్)

మహబూబాబాద్: ఈనెల 11నుంచి సమ్మె చేసేందుకు అంగన్‌వాడీలు సన్నద్ధమవుతున్నారు. అందుకు సంబంధించి అధికారులకు ఇప్పటికే నోటీసులు అందచేశారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వడంతోపాటు, పలు సమస్యల పరిష్కరించాలనే డిమాండ్లతో సమ్మెబాట పడుతున్నారు. వీరికి సీఐటీయూ, ఏఐటీయూతోపాటు పలు సంఘాల మద్దతుగా నిలుస్తున్నాయి. అయితే సమ్మె సంకేతాల నేపథ్యంలో మంత్రి సత్యవతి రాథోడ్ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమ్మెకు వెళ్లొదని, సమ్మెతో సమస్యలు పరిష్కారం కావని సూచించారు. అయినప్పటికీ సంఘాల బాధ్యులు మాత్రం సమ్మెను విజయవంతం చేసేందుకు సమావేశాలు నిర్వహించారు. సంఘాలతో మంత్రి జరిపిన చర్చల్లో ఇచ్చిన హామీలకు భిన్నంగా ప్రకటన రావడంతో సమ్మెకు సన్నద్ధం కావాల్సి వస్తుందని సంఘాల నాయకులు చెబుతున్నారు.

జిల్లాలో 1,285 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 152 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 44,997 మంది పిల్లలు, 4,647 గర్భిణులు, బాలింతలు 4,589 మంది ఉన్నారని అధికారులు తెలిపారు. మెయిన్ అంగన్‌వాడీ టీచర్లు 37 ఖాళీలు ఉండగా మినీ అంగన్‌వాడీ టీచర్ల పోస్టులు 27ఖాళీ ఉండగా.. ఆయా పోస్టులు 89 ఖాళీ ఉన్నాయి. అంగన్‌వాడీలు ప్రధానంగా కనీసం వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈనెల 4న తమ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ, ఏఐటీయూసీ వాటి అనుబంధ అంగన్‌వాడీ యూనియన్ల నాయకులు కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ హైమావతికి సమ్మె నోటీస్‌ను అందచేశారు. ఇదిలా ఉండగా.. ఆగస్టు 13న హైదరాబాద్‌లో ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ, సీఐటీయూసీ సంఘాల బాధ్యులు సమావేశం నిర్వహించి, అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయించారు. దీంతో అదే నెల 18వ తేదీన మంత్రి సత్యవతి హైదరాబాద్‌లో అన్ని సంఘాలతో సమావేశం నిర్వహించి డిమాండ్లను నెరవేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయా సంఘాల నాయకులు తెలిపారు. కానీ, మంత్రి ఇచ్చిన హామీలపై ప్రకటన రాకపోవడంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లో చేసిన ప్రకటనతో అంగన్‌వాడీలు నిరాశకు గురయ్యారు. దీంతో ఆయన యూనియన్ల ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ఈనెల 4న అధికారులకు సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈనేపథ్యంలో ఈనెల 11(సోమవారం)నుంచి నిరవధిక సమ్మెకు సన్నద్ధమవుతున్నారు.

**అంగన్‌వాడీల డిమాండ్లు..**

- అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి.
- కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలి.
- పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలి.
- సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని అంగన్ వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలి.
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్‌కు రూ.10లక్షలు, హెల్పర్‌లకు రూ.5లక్షలు.. వేతనంలో సగం పెన్షన్‌గా నిర్ణయించాలి
- రిటైర్మెంట్ వయస్సు 60 సంవత్సరాలు నిర్ణయించాలి
- ప్రమాద బీమా రూ.50 లక్షలు చెల్లించాలి
- గత నిబంధనల ప్రకారం ఎస్ఎస్‌సీ అర్హత ఉన్న హెల్పర్‌కు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలి
- సీనియారిటీ ప్రకారం వేతనంలో వ్యత్యాసం ఉండాలి. ఇంక్రిమెంట్ సౌకర్యం కల్పించాలి
- బీఎల్ఓ డ్యూటీలు రద్దు చేయాలి. ఐసీడీఎస్‌కు సంబంధం లేని పనులు కేటాయించొద్దు
- మినీ కేంద్రాలను మెయిన్‌గా గుర్తించాలి
- ఐసీడీఎస్ బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలి.
- పక్కాభవనాలు మౌలిక వసతులు కల్పించాలి
- ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి.
- ఆరోగ్య లక్ష్మి మెనూ చార్జీలు పిల్లలకు రూ.1.15 పైసలు నుంచి రూ.5లకు గర్భిణీ, బాలింతలకు రూ.2.40 నుంచి రూ.10కు పెంచాలి. డబుల్ సిలెండర్ ఇవ్వాలి
- అంగన్‌వాడీ ఉద్యోగులకు ఆసరా, కల్యాణ లక్ష్మి, తదితర సంక్షేమ పథకాలు అమలు చేయాలి
- హెల్త్ కార్డుతో పాటు వేతనంతో కూడిన మెడికల్ సెలవులు అమలు చేయాలి
- వేసవిలో ప్రభుత్వ పాఠశాలతో సమానంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇవ్వాలి.
- జీఓ 14,19,8 లను వెంటనే రద్దు చేయాలి .

**సమ్మెతో సమస్యలు పరిష్కారం కావు: సత్యవతి రాథోడ్, రాష్ట్ర మంత్రి**

సమ్మెతో సమస్యలు పరిష్కారం కావని మంత్రి సత్యవతి అన్నారు. సమ్మె సంకేతాల నేపథ్యంలో ఈనెల 8న ఆమె సంబంధిత శాఖ కార్యదర్శి భారతి హోళీ కేరితో కలిసి డీడబ్ల్యూఓలతో వీసీ నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, యూనియన్ల డిమాండ్లను తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ప్రభుత్వం స్పందించాలి**



సమ్మెలోపే ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌గా అంగన్‌వాడీ టీచర్లకు రూ.రెండు లక్షల హామీ ఇచ్చి రూ.లక్ష ప్రకటించడం, హెల్పర్లకు రూ.లక్ష హామీ ఇచ్చి రూ.50,000 ప్రకటించడం దారుణం.

- ఆకుల రాజు, సీఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు

**హామీలను అమలు చేయాలి**



మంత్రి సత్యవతి చర్చల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి. సమ్మెను నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయి. ప్రజాస్వామ్యంలో హక్కుల కోసం పోరాటాలు చేయవచ్చు. అధికారులు అంగన్‌వాడీలను బెదిరించడం సరికాదు.

- రేషపల్లి నవీన్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

## సంక్షేమ పాలనకు మద్దతు ఇవ్వాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి దయాకర్‌రావు

పెద్దవంగర: సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మద్దతుగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని బంగారు చెలిమికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆదివారం మంత్రి సమక్షంలో దరావత్ మహేష్, గణేష్, వినయ్, నరేష్, లక్ష్మణ్, దేవేందర్, సుమన్, మహేష్, శంకర్ చేరారు. వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం విషయంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు. ప్రస్తుత సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ముజీబ్, దేవేందర్, సుధీర్, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కష్టాలను ధైర్యంతో ఎదుర్కోవాలి

- ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్





మాట్లాడుతున్న డాక్టర్ పరికిపండ్ల అశోక్

మహబూబాబాద్ అర్బన్ : జీవితం జీవించడానికే ఆత్మహత్యలకు పాల్పడొద్దని, కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్, సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అడ్వకేట్స్ కాలనీలో ప్రపంచ ఆత్మహత్యల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరోగ్యవిఎత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆత్మహత్య ప్రయత్నం చేసుకునే వ్యక్తుల పట్ల, సమాజం స్వాంతన చేకూర్చి మానసిక ధైర్యాన్ని నింపాలని, తనకి ఎవరూ లేరనే అగాధాన్ని పూడ్చే ప్రయత్నంతో భరోసా నింపాలన్నారు. కష్టాల్లో ఉన్న వ్యక్తికి తనకు ఉన్న అన్ని దారులు మూసుకుపోయినప్పుడు, ఆత్మహత్య ప్రయత్నం అనే దారి తెరుచుకుంటుందన్నారు. పది సంవత్సరాలుగా ఆత్మహత్యల నివారణకు కృషి చేస్తూ ఇప్పటి వరకు 28 మందిని కాపాడి, అఖండమైన సంతృప్తితో ముందుకు సాగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో రామ్మూర్తి సదానందం, నరసయ్య పవన్ శుభ తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మహత్య పరిష్కారం కాదు..**

మహబూబాబాద్ అర్బన్ : జీవితంలో వివిధ సందర్భాల్లో ఎదురయ్యే సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని, ఒత్తిడి, సమస్యలను ధైర్యంతో ఎదుర్కోవాలని మార్గదర్శి బీఈడీ కాలేజ్ ప్రిన్సిపాల్ అరుణ్ కుమార్ అన్నారు. మహబూబాబాద్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ ఆవరణలో ఆదివారం ‘ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం’ నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు కొడారి నాగేందర్ రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా అరుణ్ కుమార్ మాట్లాడారు. విద్యార్థినులకు ఆత్మహత్యపై అవగాహన కల్పించారు. కష్టాలకు కృంగిపోకుండా సాధ్యమయ్యే లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించడానికి శ్రమిస్తూ ముందుకు సాగాలన్నారు. ఎన్ని అడ్డంకులు, ఆటుపోట్లు, కష్టాలు వచ్చిన ఆత్మహత్య పరిష్కారం కాదని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ విజయ కుమారి, రోటరీ క్లబ్ జిల్లా బాధ్యులు వద్దుల సురేందర్ రెడ్డి, బిక్కి వెంకటేశ్వర్లు, పొక్కుల సదానందం, ప్రధాన కార్యదర్శి గూడూరు నాగేశ్వరావు, కిషోర్ కుమార్, మహిపాల్ రెడ్డి, జంగాల నరసింహారావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పాకాల మత్తడి పరవళ్లు

ఖానాపురం: ధాన్యాగార కేంద్రానికి ప్రధాన నీటి వనరు అయిన పాకాల సరస్సు ఐదు రోజులుగా మత్తడి పోస్తోంది. ఇప్పటికే సరస్సు పూర్తిగా నిండిన విషయం విదితమే. ఇటీవల కురిసిన వర్షాలకు సరస్సులోకి భారీగా నీరు వచ్చి మత్తడి పోస్తుండటంతో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు.



మత్తడి పోస్తున్న పాకాల సరస్సు

## కాషాయం జెండా ఎగరడం ఖాయం

- మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు



మరిపెడలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మరిపెడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో డోర్నకల్ నియోజకవర్గంలో కాషాయం జెండా ఎగరడం ఖాయమని మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు అన్నారు. ఆదివారం మరిపెడ మండల కేంద్రంలోని కార్గిల్ సెంటర్ నుంచి వంటికొమ్ము లక్ష్మారెడ్డి ఫంక్షన్ హాల్ వరకు వందలాది మంది బీజేపీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన డోర్నకల్ అసెంబ్లీ నియోజక వర్గ పోలింగ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని గిరిజన, దళిత నియోజక వర్గాలపై కేంద్రం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. ఈ క్రమంలోనే బంజారులు ఎక్కువగా ఉన్న డోర్నకల్ నియోజక వర్గంపై బీజేపీ గెలుపు కోసం ప్రత్యేకమైన దృష్టి పెట్టినట్లు తెలిపారు. అతి త్వరలో మహబూబాబాద్ పార్లమెంట్‌లో ప్రధాన నరేంద్ర మోదీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. డోర్నకల్ నియోజకవర్గంలో బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. అనంతరం మాజీ మంత్రి, ఎంపీ రవీందర్ నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణను సీఎం కేసీఆర్ తాగుబోతు రాష్ట్రంగా చేశాడని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను ఇంటికి పంపడం ఖాయమన్నారు. మరో మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో డోర్నకల్‌లో ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను ఓడించి కాషాయం జెండా ఎగరవేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ.. 40 ఏళ్ల ఎమ్మెల్యే రెడ్యానాయక్ పాలనలో నియోజకవర్గం పూర్తిగా వెనుకబడిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాజవర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వద్దినేని రాంచందర్‌రావు, నాయకులు కూన శ్రీశైలం గౌడ్, నూకల వెంకట్‌రెడ్డి, రమేష్, చీకటి మహేష్, వెంకటేశ్వర్లు, గుగులోతు లక్ష్మణ్‌నాయక్, భూక్య సంగీత, గుగులోతు దేవిక, ప్రభాస్‌నాయక్, కాంతమ్మ, బుల్లెట్ కృష్ణ, మిథన్ లాల్, సతీష్, శ్రీనివాస్, లింగం, బింగి రమేష్ పాల్గొన్నారు.

## వనదేవతలకు మొక్కులు



సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క- సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి ప్రైవేటు వాహనాల్లో తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, చీరసారె, ఎత్తు బంగారం(బెల్లం), కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందరాజు, పగిడిద్దరాజులకు భక్తులు పూజలు చేశారు. మొక్కుల అనంతరం భక్తులు మేడారం పరిసర ప్రాంతాల్లో చెట్ల కింద విడిది చేసి వంటావార్పు చేసుకున్నారు. ఎండోమెంట్ జూనియర్ అసిస్టెంట్లు రాజేశ్వర్‌రావు, బాలకృష్ణ, రఘుపతి, రమాదేవిలు అందుబాటులో ఉండి భక్తులకు సేవలందించారు. జంపన్నవాగు వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

**హేమాచల క్షేత్రంలో సందడి..**

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తుల భారీగా తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. వివిధ సుదూర ప్రాంతాల నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు వందల సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిట లాడింది. ఉదయాన్నే భక్తులు ఆలయానికి చేరుకుని పవిత్ర చింతామణి జలపాతం వద్ద పుణ్యస్నాన మాచరించి గుట్టపై స్వయంభుగా వెలిసిన హేమాచలున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన స్వామివారి తిలతైలాభిషేకం పూజలో పాల్గొని స్వామివారి నాభిచందన ప్రసాదాన్ని స్వీకరించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలోని నిత్యాన్నదానంలో పాల్గొని కుటుంబ సభ్యులతో కలిసి భోజనాలు చేశారు.

# రెగ్యులరైజ్ చేయాలి

- ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన



మానుకోటలో సమ్మె చేస్తున్న సీఆర్టీలు(ఫైల్)

మహబూబాబాద్ అర్బన్: విద్యాశాఖ- సమగ్ర శిక్షలో, కస్తూర్బా గాంధీ పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల ఒప్పంద పద్ధతిలో వివిధ హోదాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 22 వేల మంది.. జిల్లా వ్యాప్తంగా సుమారు 657 మందిపైగా కాంట్రాక్ట్ ఉద్యోగులు గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. విద్యాశాఖలో కీలకంగా ఉంటూ తమ వంతు కృషి చేస్తున్నారు. ఈ ఉద్యోగులందరు రోస్టర్, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికై ఉద్యోగ భద్రతకు అన్ని అర్హతలు కలిగి ఉన్నారు. వీరిలో 2010లో కొందరు.. 2012లో మరికొందరు విధుల్లో చేరారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరుతున్నారు. నేటి వరకు రూ.12వేల వేతనంతో చాలీచాలని జీతాలతో బతుకులు వెల్లదిస్తున్నారు. అన్ని అర్హతులు ఉన్నప్పటికీ నేటి వరకు కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉద్యోగ భద్రతకు నోచుకోలేదు. పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని వారి ఆర్థిక, సామాజిక స్థితిగతులను పరిగణంలోకి తీసుకొని సమస్యలు పరిష్కరించి కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నారు. ఈ నిరసన దీక్షలు ఈ నెల 11వ తేదీ వరకు కొనసాగిస్తామని. లేని పక్షంలో ఈ నెల 12 నుంచి సమ్మెకు వెళ్తామని ప్రకటించారు.

**ఉద్యోగుల డిమాండ్లు**

- సమగ్ర శిక్షా ఉద్యోగలందరినీ విద్యాశాఖలో విలీనం చేయాలి
- ఉద్యోగులను రెగులరైజ్ చేయాలి
- కనీస వేతన స్కేల్ అమలు చేయాలి
- ఉద్యోగులందరికి ఉద్యోగ భద్రత కల్పించాలి
- ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10లక్షలు ఇవ్వాలి
- రూ.5లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి


**15ఏండ్లుగా పనిచేస్తున్నాం..**



విద్యాశాఖ- సమగ్ర శిక్షలో 15ఏండ్లుగా విధులు నిర్వహిస్తున్నాం. రెగ్యులర్ చేయడానికి మాకు అన్ని అర్హతలు ఉన్నాయి. రోస్టర్ కం రిజర్వేషన్ ద్వారా అప్పటి కలెక్టర్ చైర్మన్‌గా ఉండి మమ్ములని ఉద్యోగంలోకి తీసుకున్నారు. బేసిక్ పే ఇచ్చి రెగ్యూలరైజ్ చేయాలి..

- మహంకాళి వీరన్న, సమగ్ర శిక్ష జేఏసీ అధ్యక్షుడు, మానుకోట

**విద్యాశాఖలో విలీనం చేయాలి**



ఎన్నోండ్లగా కేజీబీవీలో చాలీచాలని జీతాలతో కాలం వెళ్లదీస్తున్నాం.. ఇప్పుడున్న పరిస్థితిలో మార్కెట్‌లో రూ.10వేలు పెడితే సరుకులు రావడం లేదు. అన్ని ధరలు పెరిగిపోయాయి. కస్తూర్బాగాంధీలో పనిచేస్తున్న మహిళ ఉద్యోగులందరికి ఉద్యోగ భద్రత కల్పించి, కేజీబీవీలను రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖలో విలీనం చేయాలి.

- మాలోత్ మంజుల, కేజీబీవీ ఉద్యోగి, దోర్నకల్

| వివిధ హోదాలో పనిచేస్తున్న ఉద్యోగులు | |
|---|---|
| సీఆర్పీలు | 78 |
| ఐఆర్‌పీలు | 32 |
| ఎంఐఎస్‌లు | 15 |
| కంప్యూటర్స్ కో ఆర్డినేటర్లు | 15 |
| కేజీబీవీలో | 470 |
| పార్ట్ టైమ్ వర్కర్లు | 64 |
| డీఈఓ ఉద్యోగస్తులు | 7 |
| అటెండర్లు | 15 |
| మొత్తం | 696 |

**సీఎం కేసీఆర్ మమ్మల్ని ఆదుకోవాలి**



సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అటెండర్లను రెగ్యూలరైజ్ చేయాలని. తెలంగాణలో చిన్న ఉద్యోగస్తులను సీఎం కేసీఆర్ కనికరించి రెగ్యూలరైజ్ చేశారు. కేసీఆర్ పెద్దమనస్సుతో మమ్మల్ని విద్యాశాఖలో విలీనం చేయాలి.

- దర్గయ్య, అటెండర్, మానుకోట

**ఆమరణ నిరాహార దీక్ష చేస్తాం**




రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమగ్ర శిక్షలో పనిచేస్తున్న మమ్మల్ని వెంటనే రెగ్యూలరైజ్ చేయాలి. లేని పక్షంలో మా కుటుంబాలతో ఈనెల 12నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేపడుతాం.

- ఎస్‌కే. ఖాదర్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్

## వీసీ, రిజిస్ట్రార్‌ను బర్తరఫ్ చేయాలి

- కేయూ జేఏసీ బాధ్యులు
- నిరసనకు మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ సంఘీభావం
- దీక్ష విరమింపజేసిన రావు పద్మ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారావు

కేయూ క్యాంపస్: పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని ప్రశ్నించిన విద్యార్థులపై కేసులు పెట్టించి పోలీసులచే దాడి చేయించిన వీసీ, రిజిస్ట్రార్‌ను తక్షణమే బర్తరఫ్ చేయాలని కేయూ జేఏసీ బాధ్యులు డిమాండ్ చేశారు. వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం క్యాంపస్‌లోని దూర విద్యా కేంద్రం ఆవరణలో నిరసన దీక్షలు కొనసాగించారు. విద్యార్థి సంఘం నాయకులపై దాడి చేసిన పోలీసు అధికారులను ఉద్యోగాల నుంచి తొలగించాలన్నారు. ఈదీక్షల శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ తెలంగాణ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, మాజీ ఎంపీ, కాంగ్రెస్‌పార్టీ నాయకులు సిరిసిల్ల రాజయ్య, బీజేపీ రాష్ట్ర నాయకులు వన్నాల వెంకటరమణ విద్యార్థులను పరామర్శించారు. బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

## క్లుప్తంగా

### ప్రేమ విఫలమైందని యువకుడి ఆత్మహత్య


వినోద్ (ఫైల్)

ఇల్లెందురూరల్: ప్రేమ విఫలమైందనే ఆవేదనతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు మండలం పోలారం గ్రామానికి చెందిన వినోద్ (25) మానుకోట జిల్లా కలెక్టరేట్‌లోని దివ్యాంగుల విభాగంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. పోలారం గ్రామానికే చెందిన ఓ యువతితో ఆయన ప్రేమలోపడగా, యువతి తండ్రి వినోద్‌ను హెచ్చరించాడు. దీంతో మనస్తాపానికి గురైన వినోద్ ఇరవై రోజుల క్రితం పురుగుల మందు తాగగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వినోద్ తండ్రి ప్రభాకర్ ఫిర్యాదుతో యువతి కుటుంబానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఇల్లెందు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

### గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

టేకుమట్ల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని ఆశిరెడ్డిపల్లి శివారు చలివాగులో శనివారం చేపల వేటకు వెళ్లిన పంగిడిపల్లి గ్రామానికి చెందిన పురాణం భవాని(39) గల్లంతైన విషయం విదితమే. ఈ క్రమంలో ఆదివారం ఉదయం నుంచి జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, పోలీస్, అగ్నిమాపక టీమ్ ఆధ్వర్యంలో చేపట్టిన గాలింపు చర్యల్లో భవాని మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. దీంతో మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిట్యాల ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

### బావురుగొండకు చేరిన గుర్తుతెలియని మహిళ

- పోలీసులకు అప్పగించిన స్థానికులు



గంగారం : ఓ గుర్తు తెలియని మహిళ ఆదివారం మండలంలోని బావురుగొండకు చేరగా గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బొడిగ రాంచంద్రు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకుని ఆమెను విచారించారు. ఆ మహిళ పేరు బుధవాడ ఖుదిరి. భర్త పోజిల్. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అల్లపల్లి దగ్గర గూడెంగా పేర్కొన్నారు. దీంతో అల్లపల్లి, గుండాల పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇచ్చిన పోలీసులు.. ఆ మహిళను మహబూబాబాద్ జిల్లాలోని సఖి కేంద్రానికి తరలించారు. ఆ మహిళ వివరాలు తెలిస్తే గంగారం పీఎస్‌లో సంప్రదించాలన్నారు. హెచ్‌సీ లక్ష్మీ నర్సు, రాజశేఖర్, సౌభాగ్య పాల్గొన్నారు.



# పంటలకు సస్య'రక్షణ'

- పండ్లతోటలు, తీగజాతి కూరలు, ఆకు కూరల్లో తప్పని సరి
- సెప్టెంబర్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉద్యానశాఖ అధికారి సూచనలు


బీరసాగు (ఫైల్)

చెన్నారావుపేట : ప్రస్తుతం వ్యవసాయ సాగులో పెట్టుబడులు కొండంత.. లాభాలు గోరంత ఉన్నాయి. పైగా ప్రకృతి ప్రకోపానికి పంట చేతికి వస్తుందో? రాదో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో రైతులు సంప్రదాయ వ్యవసాయంపై అనాసక్తి కనబరుస్తున్నారు. దాదాపు వరి, పత్తి, ఇతర సంప్రదాయ పంటల సాగు విస్తీర్ణం తగ్గించుకుంటున్నారు. అధిక లాభాలు వచ్చే కూరగాయల పంటలు పండించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. పండ్ల తోటలు, కూరగాయల పంటల సాగుకే సై అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ పంటలు, ఉద్యాన తోటల్లో సెప్టెంబర్ నెలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై ఉద్యాన శాఖ అధికారి దయ్యాల రమేష్ 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

**పండ్ల తోటలు**

సెప్టెంబర్ నెలలో మామిడిలో కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉంటుంది. పురుగు ఆశించిన పక్షంలో ఇనుపు తీగకు చొప్పించి బయటకు లాగి చంపివేయాలి. రంధ్రాల్లో మిథైల్ పెరాథియాన్ 50 శాతం మందును 1 మిల్లీ లీటర్ నీటికి కలిపిన ద్రావణం లేదా పెట్రోల్ లేదా అల్యూమినియం ఫాస్పైడ్ బిళ్లలు వేసి బంక మట్టితో మూసివేయాలి.

**అరటి..**

అరటిలో తల్లి మొక్క చుట్టూ వచ్చే పిలకల కోతకు ఉపయోగించు కొడవలిని ప్రతిసారి ముందు డీజిల్/ కిరోసిన్‌లో ముంచి వైరస్ తెగుళ్ల వ్యాప్తిని నివారించాలి. వైరస్ తెగులు వ్యాప్తి చేసే పేనుబంక నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ 2 మిల్లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. పచ్చ అరటి, కొవ్వూరు బొంత, కర్పూర చెక్కరకేళి రకాలను రెండో దఫాగా 110 గ్రాముల యూరియా, 80 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఇచ్చి తేలికపాటి తడి ఇవ్వాలి. తేలిక నేలల్లో వేరు సులిపురుగుల నివారణకు మొక్కకు 25 గ్రాముల చొప్పున కార్బోఫ్యూరాన్ గుళికలు మొదలు దగ్గర 10 సెంమీ దూరంలో వేసి మట్టితో కప్పి తేలికపాటి తడి ఇవ్వాలి.


రమేష్
ఉద్యానశాఖ అధికారి

**జామ..**

జామాలో కాయలు పెరిగే దశలో నీటి తడులు ఇవ్వాలి. తొడిమ కుళ్లు తెగులు నివారణకు 1 శాతం బోర్డో మిశ్రమం లేదా 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటర్ నీటిలో కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

**కూరగాయ పంటలు..**

టమాట, వంగ, బెండ పంటల్లో సిఫార్సు చేసిన నత్రజని ఎరువులను పై పాటుగా వేసుకుని నీరు పెట్టాలి. ఈ పంటల్లో వైరస్ తెగుళ్ల వ్యాప్తిని అరికట్టేందుకు రసం పీల్చే పురుగులను నివారించాలి. రసం పీల్చే పురుగుల నివారణకు ఫాసలోన్, ఫిప్రోనిల్, డైమిథోయేట్ మందుల్లో ఏదైనా ఒక మందును లీటర్ నీటికి 2 మిలీ చొప్పున కలిపి పిచికారీ చేయాలి. తెల్లదోమ నివారణకు 1.5 గ్రాముల ఎసీఫెట్‌ను లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. కాయతొలుచు పురుగు నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మిల్లీ లీటర్.. ఒక లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

**తీగ జాతి కూరగాయలు..**

తీగజాతి కూరగాయలను ఆశించే బూడిద తెగులు నివారణకు కెరాథేన్ 1 మిల్లీలీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. పండు ఈగ నివారణకు 2 మిల్లీ లీటర్ మలాథియాన్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా మలాథియాన్ 100 మిల్లీ లీటర్ 100 గ్రాములు చెక్కర లేదా బెల్లం 10 లీటర్ నీరు కలిపి విషపు ఎర తయారు చేసి మట్టి మూకుడులో లేదా ప్లాస్టిక్ పళ్లాలలో పోసి ఎకరాకు 10-12 మూకుడులను అక్కడక్కడ పెట్టాలి.

**మునగ..**

ఆగస్టులో విత్తిన ఏకవార్షిక మునగ రకాలను పాలిథిన్ సంచులతో నుంచి తీసి పొలంలో నాటుకోవాలి. విత్తనాలు మొలకెత్తే వరకు ప్రతి 3 రోజులకు నీటి తడి ఇవ్వాలి. తర్వాత 10-15 రోజులకు ఒకసారి నీటి తడి ఇవ్వాలి.

**పసుపు..**

పసుపు పంట పెరుగుదల, నేలలో తేమ సంరక్షణ కోసం కలుపుతీత అంతరకృషి చేయాలి. అవసరం మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నాటిన 80 రోజులకు ఎకరానికి 50 కిలోల యూరియా, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 100 కిలోల వేపపిండితో కలిపి వేయాలి. దుంప ఈగ ఆశిస్తే ఎకరాకు 200 కిలోల వేపపిండితో 10 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలు కలిపి మొక్క దగ్గర వేసి నీరు పెట్టాలి.

# ఐలమ్మ స్ఫూర్తితో కేసీఆర్ పాలన


ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి టౌన్ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో సీఎం కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఐలమ్మ 38వ వర్ధంతి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐలమ్మ పోరాట స్ఫూర్తితోనే సీఎం కేసీఆర్ తెలంగాణ సాధించారన్నారు. ఐలమ్మ జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తామని కేసీఆర్ ప్రకటించడం అభినందనీయన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ పాత్ర మరువలేనిదని, ఈ ప్రాంత ప్రజల్లో చైతన్యం రగిలించిన ధీరశాలి ఐలమ్మ అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, సర్పంచ్ వీరమానేని యాకాంతారావు పాల్గొన్నారు.

# కుర్చపల్లిలో అతిపెద్ద గానుగరాయి

- చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి


గానుగరాయిని చూపుతున్న రెడ్డి రత్నాకర్‌రెడ్డి

రఘునాథపల్లి: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కుర్చపల్లిలో అతి పెద్ద గానుగరాయిని చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి ఆదివారం వెలుగులోకి తెచ్చారు. గ్రామ శివారులోని మద్దెర్ల కృపాకర్ రెడ్డి ఫాంహౌస్‌లో గుర్తించిన గానుగరాయి వివరాలను ఆయన వెల్లడించారు. నాడు డంగు సున్నం తయారీ కోసం వినియోగించే ఈ గానుగరాయి ఫీటు మూడు ఇంచుల వ్యాసార్ధం, ఏడు ఇంచుల మందం.. 9 ఫీట్ల 8 ఇంచుల చుట్టు కొలత కలిగి ఉందని చెప్పారు. భవిష్యత్ తరాల కోసం చరిత్రలో ఉండాలని మద్దెర్ల ఫామ్‌హౌస్ మధ్యలో ప్రవేశ ద్వారానికి ఎదురుగా గానుగరాయిని నిలబెట్టుకోవడం అభినందనీయమన్నారు. పురారావస్తు శాఖ అధికారులు చరిత్ర ఆధారాలు వెలికి తీసి కాపాడాలని ఆయన కోరారు.

# రైతు వ్యతిరేక పాలకులకు బుద్ధి చెప్పాలి

- భారత్ బచావో ప్రచార కార్యదర్శి గాదె ఇన్నయ్య


సభలో అభివాదం చేస్తున్న గాదె ఇన్నయ్య, భూపాల్‌నాయక్, జైసింగ్ రాథోడ్

కురవి: రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని భారత్ బచావో ప్రచార కార్యదర్శి గాదె ఇన్నయ్య, వైస్ చైర్మన్ డాక్టర్ ఎంఎఫ్ గోపినాథ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో భారత్ బచావో ఆధ్వర్యంలో రైతు రణభేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. గుడి నుంచి ఫంక్షన్ హాల్ వరకు రైతులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా నల్లచట్టాలను తీసుకొచ్చి అన్యాయానికి గురిచేస్తుందని ఆరోపించారు. కేంద్రానికి రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మద్దతు పలుకుతోందని విమర్శించారు. కిసాన్ పరివార్ అధినేత ననావత్ భూపాల్ నాయక్ మాట్లాడుతూ రైతులను కాపాడే నాయకులు లేకుండా పోయారని తెలిపారు. రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి నెలకొందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించినప్పుడే రైతులకు లాభం ఉంటుందని తెలిపారు. అందుకే కిసాన్ పరివార్ సంస్థను స్థాపించామన్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో భారత్ బచావో జాతీయ కౌన్సిల్ సభ్యుడు జైసింగ్ రాథోడ్, డీవై గిరి, నల్లు సుధాకర్‌రెడ్డి, గుగులోత్ భీమానాయక్, బాదావత్ రాజునాయక్, ఆకుల రాజు, విష్ణునాయక్, రంగన్న గౌడ్ పాల్గొన్నారు.

# మూసివేసిన హాస్టళ్లను తెరిపించాలి


పరిపాలనా భవనం వద్ద ధర్నా నిర్వహిస్తున్న పీజీ, స్కాలర్స్, వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు

- కేయూలో పీజీ విద్యార్థులు, స్కాలర్స్ ధర్నా

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో మూసివేసిన హాస్టళ్లను, మెస్‌లను తెరిపించాలని డిమాండ్ చేస్తూ కొందరు పీజీ విద్యార్థులు, పరిశోధకులు, వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు ఆదివారం పరిపాలనా భవనం వద్ద ధర్నా చేశారు. గత కొంతకాలంగా యూనివర్సిటీలో వీసీ, రిజిస్ట్రార్లు చేసిన తప్పులకు హాస్టల్స్‌ను మూసివేసి పీహెచ్‌డీ విద్యార్థులను కూడా చదువులకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగ విరమణ పొందిన మీరు వీసీ, రిజిస్ట్రార్లుగా కొనసాగవచ్చు కానీ మాకు అడ్మిషన్లు ఉన్నప్పటికీ నాన్‌బోర్డర్లుగా చిత్రీకరించి వెకేట్ చేయించటం శోచనీయమన్నారు. అధికారులు కుట్రపూరితంగానే హాస్టళ్లను మూసివేశారనిఆరోపిస్తూ ఫ్లకార్డులు చేతబూని ధర్నా చేశారు. స్కాలర్ హాస్టల్ రూమ్‌లకు వేసిన తాళాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రాంత ప్రొఫెసర్ కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావును తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. కనీస అర్హతలు లేని జాయింట్ డైరెక్టర్లను, అడిషనల్ డైరెక్టర్‌ను ఆ పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ (కుర్సా) అధ్యక్షుడు తాళ్లపెల్లి నరేష్‌గౌడ్, ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జ్ మంద భాస్కర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు, ఎంఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ వడ్డేపెల్లి మధు, పరిశోధక విద్యార్థులు మాదాసి రమేష్, గుండేటి సుమన్, సోమరాజు, విష్ణు, సురేష్, సాంబయ్య, సంపత్, జానకిరామ్, ఆశీర్వాదం, విజయ్, సతీష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### వివేక్‌నగర్‌కాలనీలో చోరీ..

- ఐదు తులాల బంగారం, నాలుగు కిలోల వెండి అపహరణ

హసన్‌పర్తి: కేయూ పీఎస్ పరిధిలోని వివేక్ నగర్ కాలనీలో చోరీ జరిగింది. ఈ మేరకు ఆదివారం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం కాలనీకి చెందిన సరళ ఈనెల 3న తేదీన ఇంటికి తాళం వేసి నగరంలోని తన సమీపంలో బంధువుల ఇంటికి వెళ్లింది. వారం తర్వాత ఇంటికి వచ్చే సరికి తలుపు ధ్వంసం చేసి కనిపించింది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారం, నాలుగు కిలోల వెండి, రూ.30వేలు కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. క్లూస్‌టీమ్‌తో ఆధారాలు సేకరించారు. అనంతరం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

### టీచర్ల బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న భోగేశ్వర్

విద్యారణ్యపురి: టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారిభోగేశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన సంఘం జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీల్లో తలెత్తిన సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలతోనూ చర్చించాలని, లీన్‌లో ఉన్న పోస్టులకు కౌన్సెలింగ్ కంటే ముందే అలాట్ చేయాలన్నారు. అన్ని పాఠశాలల్లోనూ సర్వీస్ పర్సన్స్‌ను నియమించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ పూజారి మనోజ్, ఉపాధ్యాయ దర్శిని సంపాదకుడు వి.అజయ్‌బాబు, బాధ్యులు స్వామి, జె.స్వామి, లక్ష్మీపతి, అశోక్, దినేష్, సౌకత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

# వామపక్ష నేత కన్నుమూత

- గుండెపోటుతో పరికరాల భూమయ్య మృతి


భూమయ్య(ఫైల్)

శాయంపేట : కామ్రేడ్ ఓంకార్ బాటలో పయనిస్తూ పేదలకు అండగా నిలబడి పెత్తందార్లకు వ్యతిరేకంగా పనిచేసిన ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ పరికరాల భూమయ్య ఆదివారం గుండెపోటుకు గురై నాగ్‌పూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని నేరేడుపల్లికి చెందిన పరికరాల లింగమ్మ-సమ్మయ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు భూమయ్య చిన్నతనం నుంచి కష్టాల కడలిలో కొనసాగుతూనే కామ్రేడ్ ఓంకార్ బాటలో ప్రయాణం సాగించాడు. 40 ఏళ్ల పాటు ఎంసీపీఐ(యు) పార్టీలో సుదీర్ఘంగా పని చేశారు. ప్రస్తుతం పార్టీలో తెలంగాణ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పని చేస్తున్నాడు. భూమయ్యకు భార్య కనకలక్ష్మి, కుమారుడు ప్రదీప్, కుమార్తె శ్వేత ఉన్నారు. ఆయన మృతితో నేరేడుపల్లిలో విషాదచాయలు అలుముకున్నాయి.

**నేడు స్వగ్రామంలో అంత్యక్రియలు**

ఎంసీపీఐ(యు) పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ పరికరాల భూమయ్య గుండెపోటుతో ఆదివారం నాగపూర్‌లో మృతి చెందాడు. అతని భౌతికకాయాన్ని స్వగ్రామమైన నేరుడుపల్లెకు తీసుకువచ్చి సోమవారం అంతిమయాత్ర ప్రారంభించి దహన సంస్కారాలు నిర్వహిస్తామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర అధ్యక్షుడు కర్రు రాజిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి భూమయ్య అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించాలని కోరారు.

### శాస్త్రీయ విద్యావిధానానికి ఉద్యమించాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ


మాట్లాడుతున్న రామకృష్ణ

తొర్రూరు: సమాజంలో అసమానతలు లేని శాస్త్రీయ విద్యా విధానం కోసం విద్యార్థి లోకం ఉద్యమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ పిలుపునిచ్చారు. డివిజన్ కేంద్రంలో పీడీఎస్‌యూ నిర్మాణ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ నేటి విద్యావిధానం అసమానతలను పెంపొందించేలా ఉందన్నారు. విద్య ప్రైవేటీకరణ, కాషాయీకరణకు బీజేపీ ప్రభుత్వం అడుగులు వేస్తోందని, దాన్ని విద్యార్థి లోకం అడ్డుకోవాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాల్సిన అవసరం ఉందని, పిల్లల భుజాలపై పుస్తకాల బరువును తగ్గించాలన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు యుగంధర్, ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు అనిల్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి భూక్య సంతోష్, కోశాధికారి జావీద్ పాల్గొన్నారు.

### పండుగకు వస్తూ పైలోకానికి..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- మహిళకు తీవ్ర గాయాలు
- సంగెంలో ఘటన


రవీందర్(ఫైల్)

సంగెం: బోనాల పండుగకు వస్తుండగా స్కూటీ అదుపు తప్పి కిందపడడంతో ఓ యువకుడు మృతి చెందగా ఓ మహిళ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతోంది. పోలీసుల కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన పులి రవీందర్(30) హనుమకొండ కోర్టులో జ్యుడీషియల్ క్లర్క్‌గా విధులు నిర్వర్తిస్తూ తన చిన్నమ్మ చిత్ర పద్మ ఇంట్లో ఉంటున్నాడు. స్వగ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాల పండగ ఉండడంతో తన స్కూటీపై చిన్నమ్మ పద్మను తీసుకుని వస్తున్నాడు. ఈ క్రమంలో చింతలపల్లి రైల్వేగేట్ వద్దకు రాగానే స్కూటీ అదుపు తప్పడంతో ఇద్దరు కిందపడ్డారు. దీంతో తీవ్రగాయాలలైన క్షతగాత్రులను వెంటనే 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా రవీందర్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పద్మ చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై మృతుడి సోదరుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.భరత్ తెలిపారు.

**రవీందర్‌కు జిల్లా జడ్జి కృష్ణమూర్తి నివాళి..**

హనుమకొండ జిల్లా కోర్టులో క్లర్క్‌గా విధులు నిర్వర్తిస్తున్న పులి రవీందర్ ఆదివారం సంగెం మండల కేంద్రంలోని చింతలపల్లి రైల్వే గేట్ వద్ద స్కూటీపై నుంచి పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న హనుమకొండ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి కృష్ణమూర్తి సతీసమేతంగా వరంగల్ ఎంజీఎం మార్చురీలో రవీందర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో వరంగల్, హనుమకొండ జ్యుడీషియల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు బుజ్జి బాబు, మల్లికార్జున్, కోర్టు సిబ్బంది, సర్పంచ్‌ల ఫోరం సంగెం మండల అధ్యక్షుడు డేటి బాబు తదితరులు ఉన్నారు.

# విద్యార్థులను వేధించడం అమానుషం


మాట్లాడుతున్న వెంకటనారాయణ

హన్మకొండ: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశాల్లో అవకతవకలు జరిగాయని ఆందోళన చేస్తున్న పరిశోధన విద్యార్థులను టాస్క్‌ఫోర్స్ పోలీసుల ద్వారా వేధింపులకు గురిచేయడం, అక్రమ కేసులు పెట్టడం అమానుషమని రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని స్వగృహంలో ఆయా పార్టీలు, సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేయూలో హాస్టళ్లను మూసివేసి విద్యార్థులను పంపించివేయడాన్ని మేధావులు తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగి క్యాంపస్‌ను పోలీసులకు అప్పగించడం దురదృష్టకరమన్నారు. విద్యార్థి సంఘాలు ఈ నెల 12న ఉమ్మడి జిల్లా బంద్‌కు పిలుపునిచ్చాయని, బంద్‌కు తాము సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో విద్యాసంస్థలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు బంద్‌కు సహకరించాలన్నారు. బీజేపీ నాయకుడు అమరేందర్‌రెడ్డి, బీఎస్పీ రీజియన్ కార్యదర్శి సునీల్, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, వైఎస్సార్ టీపీ నాయకుడు కొటిల్ రెడ్డి, టీడీపీ నేత శ్యాంసుందర్ పాల్గొన్నారు.

### చికిత్స పొందుతున్న యువకుడి మృతి..


రాజ్‌కుమార్(ఫైల్)

వర్ధన్నపేట: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని ఇల్లందలో జరిగింది. గ్రామానికి చెందిన ఐత రాజ్‌కుమార్(26) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురైన ఆయన.. శనివారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉంది. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

### గుండెపోటుతో ప్రయాణికుడు..


యాకయ్య మృతదేహం

వర్ధన్నపేట: గుండె పోటుతో ఓ ప్రయాణికుడు ఆర్టీసీ బస్సులో మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం వర్ధన్నపేట పట్టణంలో జరిగింది. రాయపర్తి మండలం బుర్హాన్‌పల్లికి చెందిన యాకయ్య(55) పని నిమిత్తం మండల కేంద్రానికి చేరుకుని అక్కడ నుంచి వరంగల్ వెళ్లడానికి ఆర్టీసీ బస్సు ఎక్కాడు. బస్సు వర్ధన్నపేటకు ప్రవేశిస్తున్న సమయంలో గుండె పోటు వచ్చింది. దీంతో డ్రైవర్, కండక్టర్ అప్రమత్తమై 108కు సమాచారం అందించారు. వారు హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకుని యాకయ్యను పరీక్షించగా ఆయన అప్పటికే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని వర్ధన్నపేట ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..


మూడు స్వామి(ఫైల్)

నల్లబెల్లి: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అతడిని ఇన్సూరెన్స్ డబ్బుల కోసం కొట్టి చంపి కుంటలో పడవేసినట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హత్య చేసి కుంటలో పడి మృతి చెందినట్లు చిత్రీకరించారంటూ ఆరోపిస్తున్నారు. ఎస్సై నైనాల నగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేలకుంటకు చెందిన మూడు స్వామి(33)కి అదే గ్రామానికి జ్యోతితో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొంతకాలంగా స్వామి మద్యానికి బానిసయ్యాడు. గత శుక్రవారం భార్య జ్యోతి ఆరోగ్యం బాగా లేకపోవడంతో తల్లి గారింటికి వెళ్లిపోయింది. అదేరోజు సాయంత్రం నుంచి అతను కనిపించడం లేదు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు, తెలిసిన వారికి ఫోన్ చేసి ఆచూకీ కోసం వెతికారు. కానీ ఎలాంటి ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం రేలకుంట శివారులోని పుల్లమ్మకుంటలో మృతదేహం కనిపించింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతదేహం వద్దకు చేరుకుని విలపించారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు స్వామికి ఇన్సూరెన్స్ చేయించి పథకం ప్రకారం హత్య చేసి ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందినట్లు చిత్రీకరిస్తున్నారనే ఆరోపణలు గ్రామంలో వినిపిస్తున్నాయి. మృతుడి తండ్రి సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.